## క్లుప్తంగా

### సబ్ ట్రెజరీ తనిఖీ

బంగారుపాళెం: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం జిల్లా ఖజానాధికారి(డీటీఓ) రామచంద్ర తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలు, ఫేషియల్ హాజరు, సమస్యలను గురించి ఎస్‌టీఓ హరిని అడిగి తెలుసుకున్నారు.

### పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

యాదమరి: చిత్తూరు జిల్లా పీఆర్‌టీయూ ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ రుక్మిణీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి హిమబిందు, మండల నాయకులు శివప్రసాద్, సురేష్‌రెడ్డి, మోహన్‌కుమార్, విశ్వనాథ్, జమునరాణి, అఖిలబాను, కనకాచ్చారి భాస్కర్ రావు, గుణ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### అవేర్నెస్ సొసైటీ..



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ఆర్టీఐ అవేర్నెస్ సొసైటీ రూపొందించిన 2023 క్యాలెండర్‌ను సోమవారం ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్, ఎస్‌ఐ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సాధికారత కల్పించేందుకు తీసుకొచ్చిన విప్లవాత్మక చట్టల్లో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కూడా ఒకటని తెలిపారు. ఆర్‌టీఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రసాద్, గజేంద్ర, నరేష్, సతీష్, గిరి, హేమచంద్ర పాల్గొన్నారు.

### సమీకృత సాగుపై రైతులకు శిక్షణ

పూతలపట్టు: ప్రజా ప్రగతి ట్రస్ట్ వారు వ్యవసాయ శాఖా ఆధ్వర్యంలో రైతులకు సమీకృత సాగుపై శిక్షణ నిర్వహించారు. మండలంలోని ఎర్రచెరువు పల్లెలోని రైతుభరోసా కేంద్రంలో సోమవారం ఉచిత శిక్షణ అందించారు. ఆంధ్ర ప్రదేశ్ సమీకృత సాగు నీరు మరియు వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం ఋతువులకు సంబంధించి పంటల రకాలు, వాటికి వచ్చే తెగుళ్ల నివారణ మార్గాల పుస్తకాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ మధురవాణి, దేవేంద్ర, వీఏ హేమ, రైతులు పాల్గొన్నారు.

### గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



విరాళాన్ని అధికారులకు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన పాండురంగ సింగ్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. ఉదయం దాత కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి విరాళం అందించారు. వారికి ప్రత్యేక దర్శనం కల్పించి వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

### జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ శివారెడ్డి

గుడిపాల: వాహనాలు నడిపేవారు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డి అన్నారు. రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం నరహరిపేట ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ వద్ద వాహనదారులతో రోడ్డుభద్రతా నియమాల పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత అవసరమని చెప్పారు. అధికలోడ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

### ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ స్వామివారికి నిత్యకైంకర్యాలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు.

గుడిపాల: ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



కామాక్షిపురంలో గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



# గడప గడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు
- ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై ఆరా
- సమస్యల పరిష్కారానికి చర్యలు

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని చీలాపల్లె పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీవాసులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. తరువాత ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్నారా అని ఆరా తీశారు. టీడీపీ పాలనలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేవి కాదని గుర్తుచేశారు. జన్మభూమి కమిటీల సిఫార్సులు, నాయకుల అండదండలు ఉంటేనే ఇచ్చేవారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పారీలకు అతీతంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని స్పష్టం చేశారు. గత టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని చెప్పారు. మరింత మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా ఆశీర్వదించాలని కోరారు.

**సారాకు స్వస్తి పలుకుదాం**

సారా తయారీకి స్వస్తి పలకాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రాసనపల్లెలో నాటుసారా తయారీ గతంలో అధికంగా ఉండేదని, ప్రస్తుతం చాలా వరకు తగ్గిందని, అయితే పూర్తిగా స్వస్తి పలకాలని ఆయన గ్రామస్తులను కోరారు. ప్రభుత్వం తరపున సాయం అందించడానికి కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు జనార్దన్, సర్పంచులు పెరిల్లా, జయకోడి, గుణవతి, వైఎస్సార్ సీపీ నాయకులు యోవాన్, మొగిలిరెడ్డి, ప్రకాష్, లారెన్స్, మణి, జీవా, ఏసయ్య, హరి, శ్యామ్, శేఖర్, జయరట్, సాయి, శిలంబరసన్, కారిమేఘన్, రమణ, దీన, రవీంద్రారెడ్డి, సంపత్, రఘు, కృష్ణ, సురేష్‌తోపాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రతి ఇంటా సంక్షేమ వెలుగు**

బంగారుపాళెం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు నిండాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని కామాక్షిపురం, కీరమంద గ్రామాల్లో సోమవారం సర్పంచ్‌రాజా, ఎంపీటీసీ రవీంద్ర ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కామాక్షిపురం గ్రామానికి తారురోడ్డు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో శ్మశాన స్థలం దురాక్రమణకు గురవుతోందని సర్వేచేయాలని చెప్పారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కీరమందలో ప్రాథమికోన్నత పాఠశాలకు అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడ పనులు పూర్తి చేయాలని, సంబంధించిన అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టిక ఆహారాన్ని గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నారే సోమశేఖర్, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎస్సీసెల్, మైనారిటీ సెల్, యూత్ అధ్యక్షులు నాగరాజ, హితాయత్, జగదీష్, మహేంద్ర, ప్రభునాయుడు, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌మహ్మద్, మండల విప్ హేమచంద్ర, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు వేపనపల్లెలో..**

వేపనపల్లెలో మంగళవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

### ఎమ్మెల్సీ పరిచయ పత్రం విడుదల



పరిచయ పత్రాన్ని విడుదల చేస్తున్న సంఘ నాయకులు

చిత్తూరు రూరల్: ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పరిచయ పత్రాన్ని సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు. ఆ సంఘం అభ్యర్థిగా కుట్టుబోయిన బ్రహ్మానందం నియమించడంతో, ఆయన్ను నాయకులు పరిచయం చేశారు. కార్యక్రమంలో చిట్టిబాబు, బాబు, రామభద్ర, బాలాజీ, మేకల సుబ్రమణ్యం, దొరస్వామి, సామిరెడ్డి తదితరులు ఉన్నారు.

### పోలీస్ డైరీ ఆవిష్కరణ



పోలీస్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: నగరంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం పోలీస్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ డైరీని ఆవిష్కరించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఏఎస్పీ జగదీష్ చేతుల మీదుగా డైరీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు

పూతలపట్టు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ తెలిపారు. మండలంలోని చిటిపిరాళ్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని మరింత చేరువచేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులు, పక్షవాత బాధితులకు ఇళ్లవద్దే చికిత్స అందించారు. అనంతరం చిటిపిరాళ్ల పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, ఐరన్ మాత్రలను అందించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



విద్యార్థినికి వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ ప్రవీణ

## 27న మహాలక్ష్మి ఆలయ విగ్రహ ప్రతిష్ట

చిత్తూరు రూరల్: స్థానిక మురకంబట్టు కర్లం కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ట మరియు కుంభాభిషేక మహోత్సవాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ, విశ్వ జననీ చారిటబుల్ అభివృద్ధి ట్రస్టు నిర్వాహకులు మోక్ష దాయని, సురేష్ తెలిపారు. ఆలయంలో వారు సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంతకుముందు రోజు అమ్మవారి మూల విరాట్ విగ్రహం ఊరేగింపు ఉంటుందని చెప్పారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి సుదర్శన్, సభ్యులు కరుణశ్రీ, చక్రవర్తి, వెంకటేశ్వర నాయుడు, జై ప్రకాష్, గుణశేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

### అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

చిత్తూరు రూరల్: నగరంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఫేషియల్ అటెండెన్స్‌ను రద్దు చేయాలని, వేతనాలను పెంచాలని, సెల్‌ఫోన్‌లు పనిచేయడం లేదని వారు అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోదండయ్య, నాగరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 25న ఓటర్ల దినోత్సవం

తవణంపల్లె: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఈ నెల 25న నిర్వహించనున్న ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ సుశీలమ్మ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సుశీలమ్మ మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. మండలంలోని వాగుల్లో, వంకల్లో శవాలను పూడ్చుతున్న గ్రామాల్లో ప్రభుత్వ భూమిని సర్వే చేసి శ్మశాన స్థలం కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వీఆర్‌ఓలు, సర్వేయర్లను ఆదేశించారు. మండలంలోని అసైన్‌మెంట్ భూములను మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. సమావేశంలో డీటీ జయంతి, భూ రీసర్వే డీటీ వెంకటరమణ, సర్వేయర్ బాబు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఐరాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీడీలు, ఐల గురివిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు

ఐరాల: రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు సోమవారం ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల బీఎన్‌ఆర్ పేట పాఠశాల క్రీడామైదానంలో బేస్‌బాల్ అండర్–14, అండర్–17 బాల, బాలికల జిల్లా స్థాయి జట్ల ఎంపిక నిర్వహించినట్లు వివరించారు. అందులో తమ పాఠశాలకు చెందిన రూప, యువశ్రీ, వర్షిణి, సందీప్, తులసి, చరణ్‌తేజ, విష్ణు, శివ, రోహిత్, ప్రకాష్, జ్యోతీష్, నిత్యశ్రీ, దివ్యశ్రీ ఎంపికయ్యారు. వీరందరూ కాకినాడలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో పాల్గొంటారని హెచ్‌ఎం వివరించారు. క్రీడాకారులను క్రీడా పరికరాల దాత అయిన ఐల గురివిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఐల గోపాల్‌రెడ్డి, కుమారుడు రాజశేఖర్‌రెడ్డి (యూఎస్‌ఏ), కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మురళిరెడ్డి, పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పీడీలు దేవా, శివ పాల్గొన్నారు.

### 11 నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 10న అంకురార్పణ చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, తిరిగి రాత్రి 8 నుంచి 10 గంటల వరకు స్వామివారి వాహన సేవలు నిర్వహిస్తారు. 11వ తేదీ ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం హంస వాహన సేవ, 12న సూర్యప్రభ, చంద్రప్రభ, 13న భూత వాహనం, సింహ వాహనం, 14న మకర వాహనం, శేష వాహనం, 15న తిరుచ్చి ఉత్సవం, అధికార నంది, 16న వ్యాఘ్ర,గజవాహనాలు, 17న కల్పవృక్ష, అశ్వ వాహనాలు, 18న రథోత్సవం, 19న పురుషామృగవాహనం, కల్యాణోత్సవం, తిరుచ్చి ఉత్సవం, 20న త్రిశూల స్నానం, ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

## శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు



నియామకపత్రాలను అందుకున్న అభ్యర్థులతో కార్పొరేటర్ సయ్యద్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని రాంనగర్ కాలనీలో ఉన్న డీడీయూ జీకేవై శిక్షణ కేంద్రంలో అభ్యర్థులకు శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించారని కార్పొరేటర్ సయ్యద్ అన్నారు. ఆ శిక్షణ కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో 105 మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి, వారందరికీ హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చిరంజీవి మాట్లాడుతూ ఏపీలోని యువకులు శిక్షణను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశారు.

## నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

వెదురుకుప్పం: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్ అన్నారు. మండలంలోని చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం–ఉపాధి అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ నైపుణ్యాలు దాగి ఉంటాయని, వాటిని అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో కూడి ఆలోచనతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ యువతకు అనేక అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఏదో సాధించాలనే కసి ఉంటే అవకాశాలు తానంతట అవే వెతుక్కుంటూ వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద(డిగ్రీ కళాశాల), నిర్మల కుమారి(జూనియర్ కళాశాల), రీసోర్స్‌పర్సన్ ఎస్ ఎస్ రెడ్డి, అధ్యాపకులు సభాపతిరెడ్డి, ఢిల్లీప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్

## శ్మశానవాటిక పనులు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో చేపడుతున్న శ్మశానవాటిక పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శ్మశాన వాటికల ఏర్పాటు నిర్ణయం చరిత్రాత్మకమైనదన్నారు. ఈ ఏర్పాట్లపై అధికారులు మనసుపెట్టి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలను పూర్తి పారదర్శకతతో అమలు చేస్తోందని చెప్పారు. జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధిలో పీఆర్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, జెడ్పీ నిధులతో జరుగుతున్న పనులు, ఇతర శాఖల ద్వారా జరుగుతున్న అన్ని పనుల్లో పురోగతి సాధించాలని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశాన వాటికలకు కేటాయించిన స్థలాలకు హద్దులు నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జియో ట్యాగింగ్ చేసి ఫొటోలు తీయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు డీకేటీ పట్టాల మంజూరుకు భూముల అసైన్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్షలో జేసీ వెంకటేశ్వర్, డీఎఫ్‌ఓ చైతన్యకుమార్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్ర శేఖర్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ విజయ్ కుమార్ రెడ్డి, చిత్తూరు ఆర్డీవో రేణుకా, డీఎంహెచ్‌వో ప్రకాశం నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## వేగంగా ‘స్పందన’ వినతుల పరిష్కారం



తేనెబండలోని హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ‘స్పందన’లో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇదివరకు అందిన స్పందన వినతుల పరిష్కారంపై సంబంధిత విభాగాల అధికారులతో ఆమె సమీక్షించారు. స్పందన కార్యక్రమంలో అందే వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని, పరిష్కరించిన తర్వాత సరైన రికార్డులతో పరిష్కరించినట్లు నివేదిక ఇవ్వాలన్నారు. నాగాలమ్మ ఆలయం వెనుక భాగంలో మురుగునీటి కాలువలు నిర్మించాలని 44వ వార్డు ప్రజలు వినతి పత్రం సమర్పించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 8 వినతులు అందాయి. ఇంజినీరింగ్ –5, రెవెన్యూ, ప్రధాన కార్యాలయం, అకౌంట్స్ ఒక్కొక్కటి చొప్పున వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్‌వో డా.లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ఇళ్ల నిర్మాణాలకు సహాయ సహకారాలు**

జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని నగర కమిషనర్ అరుణ వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. కమిషనర్ తేనెబండ హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించారు. స్థానికంగా ఇల్లు నిర్మిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు వేగంగా ఇల్లు నిర్మించుకోవడానికి అవసరమైన ఇసుక, ఇటుకలు వేగంగా సరఫరా చేయించడానికి నోడల్ అధికారులు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి ఇటుకలు సరఫరా చేయించాలన్నారు. ఏ లేవుట్లో ఎంతమందికి ఇటుకల అవసరం ఉందో గుర్తించి అందుకు తగినట్లు సరఫరా చేసేలా చూడాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణం నిరంతరాయంగా సాగేందుకు వీలుగా అవసరమైన మేస్త్రీలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి ఇటుకల సరఫరా చేయించాలని చెప్పారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలన్నీ మార్చి 15 నాటికల్లా పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో నోడల్ అధికారులు ఉదయం నుంచే వారికి కేటాయించిన లేఔట్లకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులకు మార్గ నిర్దేశం చేశారు.

**స్పందనలో అర్జీల వెల్లువ**

పూతలపట్టు: స్పందన కార్యక్రమంలో అర్జీలు వెల్లువెత్తాయని తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. పాసుపుస్తకంలో పేరు మార్పులు, భూ సమస్యలు, ఆధార్, రేషన్‌కార్డుల్లో పేర్ల మార్పులు వంటి సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చినట్లు వివరించారు.